తరుచూ తలెత్తే సమస్యలపై ప్రత్యేక దృష్టి



శాంతినగర్‌లో సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట్: డివిజన్‌లో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు, తలెత్తుతున్న ఇతర సమస్యలను సత్వరమే పరిష్కరించాలని బాగ్ అంబర్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి జలమండలి అధికారులకు సూచించారు. శుక్రవారం డివిజన్‌లోని మహంకాళీ అమ్మవారి టెంపుల్ లైన్ శాంతినగర్, సాయి మధురనగర్, నందనవనం కాలనీ తదితర ప్రాంతాల్లో జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. తరుచు డ్రైనేజీ సమస్య తలెత్తె ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె అధికారులకు సూచించారు. అంతర్గత రోడ్ల సమస్యలను సహితం పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. అధికారులు విజ్ఞేశ్వరి, మాజిద్, బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రం, హరియాణా'ల దిష్టిబొమ్మల దహనం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యువ రైతు శుభకరన్ సింగ్‌ను బార్డర్‌లో కేంద్రం, హరియాణా రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాలు క్రూరంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య పార్కు వద్ద కేంద్రం, హరియాణా ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ... కేంద్ర హోంమంత్రి, హరియాణా ముఖ్యమంత్రులపై హత్యా నేరం కేసులను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. శుభకరణ్‌సింగ్ స్ఫూర్తితో రైతు పోరాటాన్ని తీవ్రతరం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు ఉపేందర్‌రెడ్డి, మామిడాల్ల భిక్షపతి, జక్కుల వెంకటయ్య, ఝాన్సీ, ఆర్.వెంకటరాములు, పాలడుగు భాస్కర్, పోతినేని సుదర్శన్‌రావు, శోభన్‌నాయక్, జూలకంటి రంగారెడ్డి, కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త సంత్ గాడ్గేబాబా



బర్కత్‌పురాలో నివాళులర్పిస్తున్న డాక్టర్ గౌతంరావు

నల్లకుంట: అంటరానితనం నిర్మూలన కోసం నిరంతర కృషి చేస్తూనే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విద్యా సంస్థలు స్థాపించిన గొప్ప సంఘ సంస్కర్త సంత్ గాడ్గేబాబా అని నవ యువక రజక సంఘం (ఎన్‌యూఆర్‌ఎస్) నాయకులు అన్నారు. గాడ్గేబాబా సేవలను గుర్తించి ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఎన్‌యూఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లకుంట సంజీవయ్య నగర్‌లోని అంబేద్కర్ శతాబ్ది భవన్‌లో సంత్ గాడ్గేబాబా జయంతిని ఘనంగా నిర్వహించారు. గాడ్గేబాబా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్‌యూఆర్‌ఎస్ అధ్యక్షుడు మాచర్ల అర్జున్, ఉపాధ్యక్షుడు సంతోష్, కోశాధికారి రాజేష్, కార్యదర్శి బాలు, భరత్ సాయిరామ్, రాఘవేందర్, రాజశేఖర్, సతీష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సంజీవయ్య నగర్‌లో నివాళులర్పిస్తున్న ఎన్‌యూఆర్‌ఎస్ నాయకులు

బర్కత్‌పురాలో...

కాచిగూడ: సంత్ గాడ్గే బాబా జయంతిని బర్కత్‌పురాలో ఘనంగా నిర్వహించారు. గాడ్గే బాబా చిత్రపటానికి బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్ సింగ్, సభాష్ పటేల్, బి.భీమ్‌రాజ్, రామకృష్ణ, ఎస్.రవియాదవ్, సాయి కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

కాచిగూడ: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని ప్రముఖ ఆధ్యాత్మిక వక్త భారతీయం సత్యవాణి అన్నారు. తెలంగాణ యువతి మండలి శ్రీమతి ఎ.శ్యామలదేవి మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం బర్కత్‌పురాలోని మండలి హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య తాడేపల్లి పతంజలి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సత్యవాణి మాట్లాడుతూ... అనేక రంగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో కూడిన మంచి ఆలోచనలే విజయానికి సోపానాలుగా నిలుస్తాయని అన్నారు. విద్యార్థి దశలోనే తమకు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఎదురయ్యే అవరోధాలను అధిగమించి విజయాలు సాధించేందుకు సిద్ధం కావాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రొఫెసర్ కె.వి.అచలపతి, తెలంగాణ యువతి మండలి కార్యదర్శి నివేదిత కుమార్, సరోజనీ రెడ్డి, మంజుల, ఆనంద గౌరి, కరస్పాండెంట్ డాక్టర్ డి.వసుంధర, కళాశాల ప్రిన్సిపాల్ బి.లావణ్య కుమారి, శిరీష, దీప, దీప్తి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పవర్‌బోర్ నిర్మాణ పనుల ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: అశోక్‌నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవరణలో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌లో నిర్మించతలపెట్టిన పవర్‌బోర్ నిర్మాణ పనులను గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తన ప్రత్యేక నిధులతో ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించిన విషయం తెలిసిందే. పవర్‌బోరు నిర్మాణానికి రూ. 6.50 లక్షలను కూడా కేంద్ర మంత్రి తన ప్రత్యేక నిధుల నుంచి కేటాయించారు. బీజేవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయ్ కుమార్, అశోక్‌నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామ్మూర్తి, బి.సూర్యప్రకాష్, ఐఎస్ఎన్ మూర్తి, సూర్యనారాయణ, బీజేపీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.

కవాడిగూడ డివిజన్ నుంచే లాస్య నందిత రాజకీయ ప్రస్థానం

- శోకసంద్రంలో కవాడిగూడ డివిజన్
- నారాయణగూడ రత్న జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేసిన లాస్య నందిత



లాస్య నందిత (ఫైల్)

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని కవాడిగూడ డివిజన్ నుంచే రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రాజకీయ జీవితం ప్రారంభం అయింది. 2016లో తండ్రి ఎమ్మెల్యే సాయన్నతో కలిసి లాస్య నందిత బీఆర్ఎస్‌లో చేరి అదే సంవత్సరం ఫిబ్రవరిలో జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కవాడిగూడ డివిజన్ నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి దాదాపు పది వేల ఓట్ల మెజార్టీతో సమీప టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి రూపాల రాజశ్రీపై విజయం సాధించింది. జీహెచ్‌ఎంసీ ఎన్నికలే ఆమె రాజకీయ జీవితానికి నాంది పలికింది. అంతకు ముందు కంటోన్మెంట్ బోర్డులో జరిగిన ఎన్నికల్లో నాలుగవ వార్డు పికెట్ నుంచి పోటీ చేసి లాస్య నందిత ఓడిపోయారు. లాస్య నందితకు రాజకీయంలోకి రావాలని పట్టుదల ఉండటంతో తండ్రి అప్పటి ఎమ్మెల్యే సాయన్న సహకారంతో బీఆర్ఎస్ పార్టీ తరఫున కార్పొరేటర్ టికెట్ దక్కించుకొని విజయం సాధించారు. కవాడిగూడ డివిజన్ ప్రజలతో ఆమెకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ప్రజలతో మమేకమై కార్పొరేటర్‌గా అనేక కార్యక్రమాలు చేపట్టింది. తిరిగి 2020లో జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కవాడిగూడ డివిజన్ నుంచి మరోసారి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి బీజేపీ అభ్యర్థి జి.రచనశ్రీ చేతిలో 1476 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అనంతరం 2023 ఫిబ్రవరి 19న కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అనారోగ్యంతో చనిపోయిన విషయం విదితమే. ఆ తర్వాత అదే సంవత్సరం నవంబర్‌లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ (కంటోన్మెంట్) నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా లాస్య నందిత దాదాపు 17 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించింది. అంచెలంచెలుగా ఎదిగిన లాస నందిత తండ్రి సంవత్సరం అయిన నాలుగు రోజులకే రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో కవాడిగూడ డివిజన్‌తో పాటు పక్క డివిజన్లైన గాంధీనగర్, రాంనగర్, అడిక్‌మెట్, భోలక్‌పూర్, ముషీరాబాద్ డివిజన్లలో ఉన్న ప్రజలతో కూడా ఆమెకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఏ కార్యక్రమం జరిగినా తప్పనిసరిగా హాజరై స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరించేది. కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో ఎల్‌బీనగర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి ఆమె ఎంతో కృషి చేసింది. ఉన్నత చదువులు చదివని లాస్య నందిత విద్యార్థులతో కూడా సన్నిహితంగా ఉండేది. రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణం చెందడం పట్ల కవాడిగూడలో విషాద ఛాయలు అలముకున్నాయి. కవాడిగూడలోని పలు చౌరస్తాలలో ఆమె చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

నీ జ్ఞాపకాలు మరువలేనివి..!

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో విషాద ఛాయలు
- ముషీరాబాద్ నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధం
- కవాడిగూడ కార్పొరేటర్‌గా గెలిచిన లాస్య



కార్పొరేటర్‌గా ఉన్నప్పుడు లాస్యతో సెల్ఫీ దిగుతున్న శ్రీనివాస్‌రెడ్డి



లాస్య నందిత, సీఎం కేసీఆర్‌తో శ్రీనివాస్‌రావు (ఫైల్)

ముషీరాబాద్: రోడ్డు ప్రమాదంలో మరణించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందితకు ముషీరాబాద్ నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధం ఉంది. తండ్రి సాయన్న అడుగుజాడల్లో నడుస్తూ అశోక్‌నగర్ వీధుల్లోనే రాజకీయ ఓనమాలను దిద్దుకుంది. సాయన్నకు మగ సంతానం లేక ముగ్గురు కూతుళ్లే ఉండటంతో చివరి దశలో లాస్య నందితనే తన రాజకీయ వారసురాలుగా ప్రకటించారు. అందుకే మొదటి అడుగుగా కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్‌గా పోటీ చేయించి గెలిపించారు. తరువాత 2021లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటమిపాలైనా అప్పటికే తండ్రి వయోభారం, అనారోగ్యంతో ఉండటంతో పాటు చివరికి మరణించడంతో కంటోన్మెంట్ నియోజకవర్గంపై దృష్టిసారించి అక్కడి ప్రజలతో మమేకమయ్యారు. ఆమె కంటోన్మెంట్ వెళ్లినప్పటికీ ఇక్కడి ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలతో ఆమెకు విడదీయరాని అనుబంధం ఉంది. అందరితో కలుపుగోలుగా ఉంటూ పరిచయం అయిన ఒక్కసారికే వారి మదిలో నిలిచిపోయే లాస్య నందితతో సుదీర్ఘ అనుబంధం ఉన్న రాజకీయ నాయకులు, కార్పొరేటర్లు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

అశోక్‌నగర్‌లో విషాదఛాయలు

చిక్కడపల్లి: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పొందడంతో అశోక్‌నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. బీఆర్ఎస్ పార్టీ నేతలు, అభిమానులు అశోక్‌నగర్‌లోని ఆమె నివాసానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. తండ్రి, దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురుగానే కాకుండా కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్‌గా గెలిచి ప్రజలకు విశిష్ట సేవలందించి వారి అభిమానాన్ని చూరగొన్నారని నేతలు గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే సాయన్న మరణించినపుడు కూడా ఇక్కడే ఆయన భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఇక్కడే ఉంచారు. లాస్య నందిత పార్థివ దేహాన్ని గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం ఇక్కడికి తీసుకొస్తారని భావించి అశోక్‌నగర్‌లోని సాయన్న, లాస్య నందిత ఇంటి వద్ద గీత రెసిడెన్సీ వద్ద ఉదయం నుంచే జీహెచ్‌ఎంసీ సిబ్బంది, చిక్కడపల్లి ఏసీపీ రమేష్, ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ట్రాఫిక్ ఏసీపీ ఎరిషా, ఇన్‌స్పెక్టర్ వీరేశం, ఎస్‌బీ, ఇంటెలిజెన్స్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఐదేళ్లు కలిసి పని చేశాం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన మొదటి జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో లాస్యనందిత ముషీరాబాద్ నియోజకవర్గం కవాడిగూడ డివిజన్ నుంచి, నేను రాంనగర్ డివిజన్ నుంచి బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎన్నికైయ్యాము. మా డివిజన్‌ల అభివృద్ధి కోసం జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌లో సమస్యల పరిష్కారం దిశగా అనేక సమస్యలను లెవనెత్తి సాధించుకున్నాం. ఈఐదు సంవత్సరాలు కలిసిమెలిసి పని చేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశాం. ఎప్పుడు కలిసిన అన్నా అంటూ ఆప్యాయంగా పలకరించేది. ఆ తరువాత జరిగిన ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో సైతం అదే స్ఫూర్తితో పని చేసి పార్టీ అభివృద్ధికి ఎంతగానో పాటుపడింది. అందరితో సఖ్యతతో ఉంటూ ప్రజలతో కూడా అదే విధంగా నడుచుకుంది. ఆమె అకాల మరణం నన్ను ఎంతగానో కలచి వేసింది.

– వి.శ్రీనివాస్‌రెడ్డి,రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్

కష్టపడే మనస్తత్వం

లాస్య నందితది ప్రజలతో కలిసిమెలిసి ఉంటూ కష్టపడే మనస్తత్వం కలది. తండ్రి సాయన్నకు మగ సంతానం లేకపోవడంతో ముగ్గురు కూతుళ్లల్లో లాస్య నందితనే తన వారసురాలిగా ప్రకటించారు. అందుకే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కుటుంబం కూడా లాస్యనందితనే ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలిపారు. నాకు సాయన్నతో పాటు వారి కుటుంబంతో విడదీయరాని అనుబంధం ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కంటోన్మెంట్ ఇన్‌చార్జిగా కేసీఆర్ నియమించడంతో ఆమె విజయం కోసం తనవంతుగా కృషి చేశాను. ఈ సమయంలో ఆమె కార్యకర్తలతో మెలిగే తీరు, విజయం కోసం తీసుకున్న నిర్ణయాలు, చొరవ నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆమె మరణం కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటు.

– ఎం.ఎన్.శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ సీనియర్ నేత

చిన్నప్పటి నుంచి స్నేహితులం



నా తండ్రి ముఠా గోపాల్, లాస్య నందిత తండ్రి సాయన్నలు మంచి స్నేహితులు ఎమ్మెల్యే కానప్పటి నుంచి తెలుగుదేశం పార్టీలో ఒకే స్కూటర్‌పై తిరుగుతూ నగర ప్రజలకు, ముఖ్యంగా నియోజకవర్గ ప్రజలకు సుపరిచితులు. వారి మాదిరిగానే మా ఇద్దరి ఫ్యామిలీలు కూడా కలిసిమెలిసి ఉండేవి. చిన్నప్పటి నుంచి కలిసిమెలిసి ఉండేవాళ్లం. వ్యాపారం, రాజకీయంగా కూడా కలిసిమెలిసే చేశాం. అలాంటి నా చిన్ననాటి స్నేహితురాలు తండ్రి మరణించిన సరిగ్గా సంవత్సర కాలానికి మరణించడం ముఖ్యంగా ఎమ్మెల్యేగా గెలిచిన రెండున్నర నెలల్లోనే మూడుసార్లు మృత్యువు నుంచి తప్పించుకొని చివరకు మరణించడం చాలా బాధాకరం. నాకు ఈ రోజు చీకటి రోజు.

– ముఠా జైసింహ, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తనయుడు

డీసీఎల్‌గా రాజేంద్రప్రసాద్



రాజేంద్రప్రసాద్

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ కార్యాలయంలో కార్మిక శాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ (డీసీఎల్)గా రాజేంద్ర ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. నల్లగొండ నుంచి రాజేంద్రప్రసాద్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ డీసీఎల్‌గా ఉన్న శ్యామ్‌సుందర్‌జాజు బదిలీపై నల్లగొండకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని స్పష్టం చేశారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ అభ్యుదయ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు తుఫాన్ ఫౌండేషన్ సంస్థ ఆర్థిక సాయం అందించింది. శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తనయుడు కోవ రాహుల్, సామాజిక వేత్త దోసేటి సత్యం విద్యార్థులకు రూ. 10 వేల ఆర్థిక సాయం (ఫీజు) అందించారు. పాల్గొన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తాడేపల్లి శ్రీనివాస్, తుఫాన్ ఫౌండేషన్ అధ్యక్షుడు డి.బాలకృష్ణ, అభ్యుదయ హైస్కూల్ ప్రిన్సిపాల్ శైలజ, చిలుకూరి లలిత, తాడేపల్లి శ్రీనివాస్, బీజేపీ ఓబీసీ నాయకులు తొలుపునూరి రమేష్‌గౌడ్, లక్ష్మీనారాయణ, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న అంజన్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట్: దేశ భవిష్యత్తు కోసం పనిచేసే ఏకైన పార్టీ బీజేపీ అని ఆ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్తా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంబర్‌పేట నియోజకవర్గం ప్రభారి అంజన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం పార్టీ బాగ్ అంబర్‌పేట్ డివిజన్ కార్యవర్గ సమావేశం భరత్‌నగర్ కమ్యూనిటీ హాల్ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి సమావేశాలు నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు చుక్క జగన్, నాయకులు చంద్రశేఖర్, కృష్ణగౌడ్, అజయ్‌కుమార్, అచ్చిన రమేశ్, శ్యామ్‌రాజ్, గోవర్ధన్‌రెడ్డి, కోడూరి సురేష్, ఎం.రోహిత్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర జీవితం

చిక్కడపల్లి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చునని జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ ఖాదర్ మెయినుద్దీన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెత్తను సేకరించాలని, రోడ్లపై వేయకూడదన్నారు. చెత్తను రోడ్లపై వేయడంతో పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొనడంతో పాటు దోమలు, ఈగలు అధికమై రోగాలను వ్యాప్తిచేందే ప్రమాదంఉందన్నారు. మహిళా గ్రూప్ సభ్యులు ఆయా కాలనీల్లో రోడ్లపై చెత్తను వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్పొరేటర్లు ఎ.పావని వినయ్‌కుమార్, రచనశ్రీ, సుప్రియగౌడ్, రవిచారి, ఏఎంఓహెచ్ మైత్రేయి, అధికారులు సుధ కారం, శంకర్ పాల్గొన్నారు.

వీణాగోష్టి గానమాధుర్యంతో గురువందనం



చిక్కడపల్లి: ప్రముఖ వీణా వాయిద్య నిపుణులు ఆనందరాజ్యలక్ష్మి చవాన్ శిష్య బృందం వీణాగోష్టి గానమాధుర్యంతో గురువందనం చేశారు. త్యాగరాయగాన సభలో శుక్రవారం రాత్రి ప్రముఖ సంగీత సంస్థ ఆనంద మహతీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువందనం పేరిట శాస్త్రీయ సంగీత బరిత కార్యక్రమం జరిగింది. వీణావాయిద్య గోష్టిలో కళాకారిణులు శ్రుతిలయబద్ధంగా వాగ్గేయకారుల కీర్తనలు వీణలపై పలికించారు. అనంతరం జగిరిన సభలో కస్టమ్స్ మాజీ ఉన్నతాధికారి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ... ఆనందరాజ్యలక్ష్మీ వీణావాదనలో శిక్షణనిచ్చి ఎందరో ప్రతిభావంత కళాకారులను దేశానికి అందిస్తున్నారన్నారు. క్షీరసాగరం వ్యవస్థాపకులు ఆనందమోహన్, వైద్యులు సింతిల్ రాజప్ప, గాయని బాలాత్రిపురసుందరి, న్యాయవాది విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఆనందలక్ష్మిని శిష్యబృందం పాదపూజ చేసి సత్కరించారు.

కేజ్రీవాల్‌కు ఈడీ, సీబీఐ సమన్ల వెనుక బీజేపీ కుట్ర: ఆప్

లిబర్టీ: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే కేంద్రంలోని బీజేపీ పాలకులు ప్రతిపక్ష పార్టీలపై కుట్రలు పన్నుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. రాజకీయ కుట్రలో భాగంగా ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాలని ఈడీ, సీబీఐలతో అక్రమ నోటీసులు పంపుతున్నారని అన్నారు. ఈడీ నోటీసులు పని చేయనందునే సీబీఐ ద్వారా కేజ్రీవాల్ అరెస్టుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు.

సమగ్ర కులగణన చరిత్రాత్మకం

కాచిగూడ: రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేయాలని శాసనసభలో తీర్మానం చేయడం సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న సంచలన నిర్ణయం చారిత్రాత్మకమని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. జాతీయ బీసీదళ్ ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడలో కుల గణన జరిగిన మేధోమధన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. సామాజిక కుల సర్వే బలహీన వర్గాల జీవితాలలో వెలుగులు నింపుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ బీసీ దళ్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మహేంద్ర బాబు, మేధావుల ఫోరం కన్వీనర్ సత్యనారాయణ, న్యాయవాది సాయి దినేష్, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో ఆర్పీఐ పోటీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అతావలే) పార్టీ అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బి.నాగేశ్వర్‌రావు వెల్లడించారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆర్పీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నప్రసాద్‌ను రాష్ట్ర ఇన్‌చార్జిగా నియమించారు. అనంతరం నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో తమ పార్టీని బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర కమిటీతో పాటు జిల్లా, మండల స్థాయి కమిటీలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే తమ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. జాతీయ కార్యదర్శి నాగేశ్వర్‌రావుగౌడ్, జాతీయ నాయకులు ప్రభుదాస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు వి.వి.లతప్రభాకర్, మహిళా అధ్యక్షురాలు స్నేహలతగౌడ్, ఉపాధ్యక్షురాలు అనిత, గడ్డ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావును ఘనంగా సత్కరించారు.

కాచిగూడ ఏసీపీ రఘుకు సత్కారం



ఏసీపీ రఘును సన్మానిస్తున్న సుదర్శన్

కాచిగూడ: కాచిగూడ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన వి.రఘును శుక్రవారం శివసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సుదర్శన్, అధికార ప్రతినిధి గౌట్ గణేష్ ఘనంగా సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పార్టీలకతీతంగా ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా ఏసీపీ సూచించారు. కాచిగూడ ఎస్ఐ హెచ్.నరేష్ పాల్గొన్నారు.

వేడుకగా శివపార్వతుల కల్యాణం

ఘనంగా రాజశ్యామల అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవం

కవాడిగూడ: కామాఖ్య మృత శోధన సంస్థ నేతృత్వంలో ఎన్టీఆర్ స్టేడియంలో రాజశ్యామల అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వాసవి సేవా సమితి రాంనగర్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం గాంధీనగర్, ఆర్యవైశ్య సంఘం చిక్కడపల్లి, వాసవి సేవా కేంద్రం హైదరాబాద్, వాసవి క్లబ్ సంస్థల దివ్య ఆశీస్సులతో కార్యక్రమం జరిగింది. వేణు శ్యామ ఆధ్వర్యంలో పంచశత రాజశ్యామల హోమం, శివపార్వతుల కల్యాణం, యంత్ర సిరిజ్యోతి పూజా (లఘు సవావరణ పూజ) వందలాది మంది భక్తులతో 108 అడుగుల శ్రీ చక్రమంనకు వెయ్యి కిలోల పూల అలంకారంతో లలిత సహస్రనామ పారాయణం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు కసన గట్టు రాజశేఖర్‌గుప్తా, వాడకట్టు రాజు గుప్తా, ఆమ్‌రాధి నాగరాజు, అనంతుల ఆంజనేయులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

నియామకం



శంకర్‌కు నియామక పత్రాన్నిస్తున్న చెన్నయ్య

కాచిగూడ: మాల మహానాడు రంగారెడ్డి జిల్లా యూత్ అధ్యక్షుడిగా చేపూరి శంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జె.చెన్నయ్య శుక్రవారం ఆయనకు అందజేశారు. నేతలు తాలుక రాజేష్, బైండ్ల శ్రీనివాస్, ఆదర్శ్ మౌర్య, బూర్గు రమేష్, ఎల్లస్వామి, చేపూరి రాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

కాచిగూడ: టీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) సెక్రటరీ జనరల్‌గా నూతనంగా నియమితులైన కె.హనుమంతు ముదిరాజ్‌ను ఐఎన్‌టీయూసీ నేతలు, ఆర్టీసీ కార్మికులు నారాయణగూడలోని యూనియన్ కార్యాలయంలో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ... ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా తనవంతు కృషి చేస్తానని అన్నారు. టీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సెక్రటరీ జనరల్‌గా తనకు బాధ్యతలు అప్పగించిన ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఐఎన్‌టీయూసీ నేతలు ఆర్.డి.చంద్రశేఖర్, టి.సుధాకర్, డి.వి.కె.రావు, అబ్రహం, గోపాల్, శీనయ్య, గోలి రవీందర్, వెంకటేష్, పాండు, శ్రీనివాస్, కృష్ణ, శేఖర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ వార్ రూమ్ వైస్ చైర్మన్‌గా అనిత



దీపాదాస్ మున్షీని అభినందిస్తున్న అనిత

చిక్కడపల్లి: టీపీసీసీ వార్ రూమ్ వైస్ చైర్మన్‌గా గాంధీనగర్‌కు చెందిన జక్కని అనిత పద్మశాలి నియమితులయ్యారు. ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జీ దీపదాస్ మున్షీ, కార్యనిర్వహణ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్లకు అనిత కృతజ్ఞతలు తెలిపారు. పవన్ మల్లాది, టీపీసీసీ వార్ రూమ్ చైర్మన్ ఆధ్వర్యంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో టీపీసీసీ వార్‌రూమ్ టీమ్ ఎంతో కృషి చేస్తుందని, 17 నియోజవర్గాలలో గెలుపు కాంగ్రెస్ పార్టీదేనని స్పష్టం చేశారు.

'వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా'తో ఏఐవైఎఫ్ రాష్ట్ర సదస్సు

హిమాయత్‌నగర్: 'వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా' నినాదంతో ఏఐవైఎఫ్ జాతీయ సమితి పిలుపులో భాగంగా 'దేశ పాలకుల విధానాలు–నేటి యువత కర్తవ్యం' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ నేతలు తెలిపారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 28న వరంగల్, ఎల్‌బీ కళాశాల జయసేన ఆడిటోరియంలో ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు పి.శివసేనారెడ్డిని శుక్రవారం కలిసి ఏఐవైఎఫ్ నేతలు కోరారు.